

# ఆకాశంతో ఆలింగనం

ఊరోళ్ళు అందరూ ఆనందంగానే కాదు, హడావుడిగా కూడా వున్నారు ఇంతెందుకూ? ప్రతి ఒక్కరు పరీక్ష పాసయిన విద్యార్థిలా. లాటరీలో ఫస్టు ప్రయిజు గెల్చుకున్న వాడిలా ఉన్నారు.

ఇంతకు ఈ కథలోని సంఘటనలు ఏ వూర్లో జరిగినవి?- అంటే అమలాపురం లో కావొచ్చు, ఇమలాపురంలో కావచ్చు. కాకపోతే ఉమలాపురంలో కావొచ్చు. ఊరేదైతేనేం మొత్తం మీద మన బంగారు భారతదేశంలో!

ప్రజలు సంతోషంగా వుండటానికి, ఊరి మధ్యలో పెట్టిన మైక్-ఫిలిం పాటలూ కొంత వరకు కారణమైనా, అసలు కారణం వేరేవుంది. అసలు లౌడ్ స్పీకరు ఊరి మధ్య లోనికి రావడానికి కూడా కారణమదే.

ఆ సాయంత్రానికి, ఆ వూరికి ఈ స్వాతంత్ర్య దేశంలో తెలుగు ప్రజలచే ఎన్నుకోబడిన ఒకనొక మహా మంత్రిగారు వేంచేయడం

జరుగుతుంది. ఆ తరువాత విద్యుద్దీపాలు వెలిగించడం చేస్తారు. ఆ అఖండ కార్యక్రమాన్ని చూడబోతున్నాం గదా అని ప్రజలు ఎంతో దూరం నుండి కూడా వచ్చారు. కళ్ళు వెలిగించుకుంటున్నారు. మనసుకు పగ్గాలేసి. మరీ లాగి పట్టుకుంటున్నారు.

ఊరి మధ్యలో మైక్ ఎర్పాటు చేశారు. అక్కడే నాలుగు పెద్ద బల్లపీటలు వేసి. వాటి మీద మెత్తని తెల్లని పరుపులు పరిచారు. చుట్టూ మూడువైపులా పరదాలు కట్టారు. రంగు కాగితాలతో అలంకరించారు. పూల దండలు ఏర్పాటు చేశారు. ఇన్ని ఏర్పాట్లు, పాపం! స్కూలు ఫైనలు దాకా చదివిన ఐదారుగురు కుర్రాళ్ళు, బి.ఎ. డిగ్రీలు పుచ్చుకున్న మరో ఇద్దరు ముగ్గురు నిరుద్యోగ యువకులు చెయ్యాల్సి వచ్చింది. సర్పంచ్‌గారు మాత్రం నిదానంగా అరుగు మీద ఒరిగి. చుట్ట కాలుస్తూ "అట్ల నూ స్తరేందిరా? తలో పనందుకోండస! పొద్దొబతాంది-అంటూ కూర్చుండే గుర్రాలు మలువుతున్నారు.

చిన్న పిల్లలు స్టేజీ ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు. పెద్ద పిల్లలు అడ్డగిస్తున్నారు. మైక్ సెట్ ఎక్కణ్ణించి తెచ్చారో గాని, ఎక్కిళ్ళు తీస్తూ పాడుతున్నట్టుగా 'తీస్కో కోకకోలా యేస్కో రమ్ము సారా' అనే పాట గ్రామ ప్రజల్ని ఉత్తేజపరుస్తుంది.

అసలైతే మంత్రిగారు రావలిసింది సాయంత్రం ఐదు గంటలకు-అయిపోయి ఆరయినా రాలేదు.

మంత్రిగారి కారు కష్టపడ కూడదని, మెయిన్‌రోడ్డు నుండి ఊరిమధ్య దాక వేసిన రోడ్డుకు, రైతుల వారం రోజుల కష్టానికి సాఫల్య మెప్పుడో అని చిన్న పెద్ద అంతా ఎదురు చూస్తున్నారు.

ఏడుంబావు కాల్లా ప్రత్యక్షమయ్యారు. మంత్రిగారు. వస్తూనే

అక్కడి రోడ్లు బాగులేవన్న సంగతి, ఊరి సర్పంచుగారితో చర్చించారు. ఊరి బయట మురుగు వాసనను దూషించారు. సర్‌పచ్‌గార్కి ఇతర గ్రామ పెద్దలకు అవన్నీ బాగుపర్చాలని సూంచిచారు. 'మీ సహాయ ముంటే తప్పకుండా చేస్తాను అదెంత పని'–చేతులు నలుపుకుంటూ, సిగ్గు నములుకుంటూ పెళ్ళి కూతురులా మహాసిగ్గు పడిపోయారు సర్‌పంచ్ గారు.

దేవుణ్ణి చూసినంత సంబరం ప్రజలకు. అందులో కొందరు మంత్రిగారు కూడా మనిషిలానే వున్నందుకు విచారపడి–ఊహాలు పగల గొట్టుకున్నారు.

అన్నట్టూ, మంత్రిగారొక్కరే రాలేదు. వెంట చాలా మంది వున్నారు. వాళ్ళల్లో ఎవరేం చేస్తారో అక్కడ ఎవరికీ తెలియదు, యూనిఫాంలో మాత్రం వున్నారు. అందుకే వాళ్ళ మెళ్ళోకూడా పూల మాలలు వాలాయి.

మంత్రిగారు మీట నొక్కారు. లైట్లు వెలిగాయి. ప్రజల్లో ఏదో నిరుత్సాహం మలిగింది. ప్రథమంగా మంత్రిగారి సహచరుడొకరు మైక్ ముందు కొచ్చి, ఊదిస్పీకర్న వేళ్ళతో కొట్టి (పాత గోడల్లో రెండు పంది పిల్లలు భయపడి పారిపొయ్యాయి) ఉపన్యాసం ప్రారంభించారు–విద్యుద్దీపాల ఆవశ్యకత గూర్చి చెప్పేస్తున్నారు. చెప్పిన నాలుగు విషయాలనే, అటూ ఇటూ కలిపి కష్టపడి ఇరవై నిముషాల సేపు చెప్పారు. ప్రజలు నిశ్శబ్దంగా వింటున్నారు ఎక్కడి నుండో రెండు గాడిదలు పరుగుతీసుకుంటూ వచ్చి ఆ చివర్న నిలిచి చూస్తు న్నాయి. కాని పాపం! వాటి తప్పేం లేదు–మైక్‌లో అతని గొంతు వాటి సహచరుల గొంతులా అనిపించింది......

అతడు ముగించాడు.

చప్పట్లు మొదలు కాగానే అవి బెంబేరిపొయ్యాయి.

చప్పట్లు ఆగక ముందే మంత్రిగారు అందుకున్నారు.

"సోదర సోదరీ మణులారా!

నేడు మనం ఇక్కడ ఈ నాడు ఈ సమావేశంలో ఎందుకు సమావేశమైనా మన్నది మీ అందరికీ తెలిసిన విశయమే-నేను వేరే చెప్పనవసరం లేదని మనవి చేస్తున్నాను.

అయితే ఈ నాడు ఈ వూర్లో బస్తీల మాదిరిగా లైట్లు ఎలిగినయి. ఆసలిక్కడికి ఈ కరెంటు రెండేడ్ల కిందనే ఒచ్చేదుండె-కాని ఎన్నో గొడవలు జెయ్యబట్టి వీలుగాలేదు—మీ ఊరి సర్పంచు గారు ఎన్నోసార్లు నా దగ్గరికి వచ్చి, ఈ విశయం గూర్చి చర్చించే వారూ, మరియూ ఇవ్వాళ్టికి ఈ పని సాధించారు. నిజంగా వారు చాలా మంచివారు. (చప్పట్లు!!-సర్‌పంచ్‌గారు కూడా కొట్టారు.)

అసలు మొదట్లో మన తెలుగుదేశ మెట్లుండెనో, ఇప్పుడెట్లుందో మీ అందరికీ తెలుసు. ఆనాడిట్ల లెట్లు లెవ్వు. రోడ్లు లెవ్వు. బళ్ళు లెవ్వు. పంచాయితీ ఆపీసు ల్లెవ్వు. మనందరికీ (పాపం! నాయకులకి కాబోలు) ఇండ్లు లెవ్వు. కాని అదే ఈనాడు మనకు ఇవన్నీ ఉన్నయ్. ప్రతి ఒక్కడూ సద్దుకొని ఉన్నాడు-ఉన్నాయంటే ఎట్లా ఉన్నాయ్? అంత మన కృషి! దాని తోనే మనం యింకా అభివృద్ధీ అభ్యుదాయమూ సాధించాలె.

ఈ నాడు మనం సాధించవలసిందేమిటి? చేయవలసిందేమిటి?- ఇది ఈనాడు మనం ఆలోచించి ఆచరణలో పెట్ట వలసిన అత్యవసర పరిస్థితి అని నేను మనవి చేస్తున్నాను."- అంటూ మంత్రిగారు ఆవేశంలో

కొచ్చారు. ప్రతీది కుండ బ్రద్దలు కొట్టినట్లు చెపేస్తున్నారు. అసలు ఆంధ్రప్రదేశ్ ఎందుకూ? ఎలా? అవతరించిందో అక్కడి నుండి అప్పటికీ ఇప్పటికీ జరిగిన అభివృద్ధి–వ్యత్యాసం చెబుతూ, అభివృద్ధికి తనెంత కష్టపడింది కూడా కొంచెం విపులీకరించారు. మధ్య మధ్య చప్పట్ల చప్పుడుకు అక్కడి చెట్ల మీది పక్షులు బెదురుతున్నాయి.

"దేశం ఇంత ముందు కెందుకు పోతున్నదంటే-ఈనాడు మనకు కనిపించిది ఒక్కటే! ఏమిటంటే మన పార్టీ వుండబట్టే!! అందు వలన ఇట్లనే అభివృద్ధి చెందాలంటే మీ రందరూ కృషి చేయాలె. ఒచ్చే ఎన్నికలల్లి నేను నిలబడినా మన పార్టీ నుంచి ఎవరు నిలబడినా గెలిపించే బాధ్యత ప్రజలది. అందు వలన ప్రజల్లో నించి ఉత్తమ నాయకుణ్ణి, ప్రజానాయకుణ్ణి, ఎన్నుకోవాలని నేను మనవి చేస్తా వున్నాను. ఎందు కంటే నేను కోరేది ప్రజా క్షేమం."— అనే ముక్క కూడా చెప్పి మొత్తానికి ఎలాగో ముగించారు ఓ అరగంట మాట్లాడిన తరువాత-

జనం ఐదు నిముషాల సేపు చప్పట్లు కొట్టి, చేతులు నొప్పులు అయినందువల్ల వూరుకున్నారు. ధ్వని కంపనాలు మంత్రిగారి చెవుల్లో దూరి రబ్బరు బుగ్గల్లా ఆయన మనసును ఉబ్బగొట్టాయి.

మరో రెండు నిమిషాల్లో తెల్లబట్టలు సర్‌పంచ్ గారి బంగాళా వైపు నడిచివెళ్ళాయి. మైక్‌లో ఓ కుర్రాడు పాట పాడడం మొదలెట్టాడు.

స్టేజీ ముందున్న గుంపులో సంచలనం కలిగింది. ఒకొక్కొక్కరు లేచి వెనక్కి వెళుతున్నారు. 'అయ్యయ్యో' అంటున్నారు. కొందరు బాదుకుంటూ ఏడుపు మొదలెట్టారు. "ఓరక్క గస్లెట్లాయెరా ?" అంటూ వెళుతున్నారు ఊరి పెద్దలు.

ఇరవై గజాల దూరంలో ఒంటెద్దు బండి నిశ్శబ్దంగా నిలబడి

వుంది. సంతాపం తెలుపుతున్నట్లుగా తలవంచుకు నిలబడింది, బుద్ధిగా తెల్లెద్దు బండివాడు మల్లడు మహా హైరానా పడిపోతున్నాడు. బండి చుట్టూ తిరుగుతున్నాడు. మీటింగు నుండి పరిగెత్తి వచ్చిన జనం బండి లోని శరీరాన్ని బయటికి లాగేసింది. శరీరం–చిన్న పుల్లనిది!! చిన్న పుల్లడు సర్పంచ్ జీతగాడు.

వీధి విద్యుద్దీపాలొచ్చినా ముఖం పోల్చుకునేట్టు లేనందువల్ల, ఎవరో తొందరగా రెండు ఖందిళ్ళు పట్టుకొచ్చారు, ఆ వెలుగులో వాని శరీరం మరీ వికృతంగా కనిపిస్తోంది. పోగా, వాని మూలుగు మృత్యువుకు సంకేతంగా వినవస్తూ వాని ఆత్మీయుల గుండెల్ని కొంచెం కొంచెం గిచ్చుకు తింటోంది. పుల్లడి శరీరం చూడ్డానికే భయపడుతున్నారు కొందరు వాడి అరచేతులు వాతలు పెట్టినట్టు కాలి తెల్లగా బొబ్బలు తేలాయి నొసలు కాలి బొక్క తేలింది. శరీరం అంతా పెద్ద దెబ్బలు తాకాయి. రక్తం మరకలు కొన్ని ఏర్పడ్డాయి. కళ్ళు మూసుకుని ఉన్నాడు. అసలే ఎత్తుపళ్ళు భయంకరంగా కనిపిస్తున్నాయి. పుల్లడి తల్లి భార్య, తమ్ముడు చుట్టూ చేరి ఏడుస్తున్నారు. పద్దెనిమిదేళ్ళ పుల్లడు పెళ్ళి చేసుకుని ఆరునెలలైనా కాలేదు. వాని పెళ్ళాం అభాగ్యానికి అందరూ విస్తుపోయి చెంపలకు చూపుడు వ్రేళ్ళు గుచ్చుకున్నారు. దేవుణ్ణి దయ్యాన్ని తిట్టినట్టు తిడుతున్నారు కొందరు. బండివాడు మల్లడు చెప్పిందే మళ్ళీ దుమ్ము ఎగబోస్తూ చెబుతున్నాడు.

"బట్టోనికోలు కాడ ఒరాలు గడ్డాన. ఆడు జెమదార్ బాయి కాడ తుమ్మచెట్టు మొదట్ల కూగోని పదంబాడ్తాండు–నాకినిపిత్తనేవుంది. ఇగ జెర సైకినంక నాపనిల బడి నేనటు సూల్లెదు. ఇంతలకు 'వావ్ అని కరెంటు శాటు గొట్టంగనె తీగెల మీంచి లగాయించి కిందబడ్డడు. ఇంతలకే నేను జూస్తి! గదేమో గట్లగొట్టెనని ఎటమట మాయొవని ఎటుతోసక ఇగ ఊల్లెకు తీస్కొచ్చిన!'

"ఈనికి పొయ్యేకాల మొచ్చింది. ఓరి పోరడ గదరా, ఏంబుట్టెర నీకు''

"బంగార మసోంటి పోరడు-దుర్బుద్ధి పుట్టింది"

"ఆని శానతనంకు నా——''

"నీ తీట పోరన్కి-నా బారేద్దు, ఎవని పెండ్లి కెక్కిండాడికి"

పలు రకాలుగా ఆడ, మగా తలో మాటంటున్నారు. ఇంకొకడు ఎక్కణ్ణించో తోసుకుంటూ వచ్చి- "అరెరె గీడు రోజు గట్లనే ఎక్కు, ఎక్కి, కరెంటు తీగెల కేల్లాడి మల్ల తంబం దిగుగని- నిన్న మొన్న కరెంటు లేదాయె గన్క, ఏంగాలె. మరి ఇయ్యాల్ల కరెంటు చాలయితని ఎర్కుండి గూడ ఎందుకెక్కిండీడు?

పుల్లడు మెల్లగ మూలుగుతూనే వున్నాడు. ఆ గోల మధ్యన అది వినిపించడం లేదు.

''సూత్తరేందిర! ఓడురికి సర్పంచుకు శెప్పిరాంర్డి. ఇంట్లెనె ఎయింర్డి. ఈన్ని పేటకు తీస్కపోయి దవాకాన్ల నైతె సూపిచ్చు కొద్దాం" వాణ్ణి, మళ్ళీ ఇంట్లో వేశారు. క్షణాల మీద సర్పంచు పరుగెత్తు కొచ్చి విషయమంతా విన్నారు. పుల్లడంటే సర్పంచిగారి ప్రాణం. అందుకే కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. ఏదో ఆలోచన తట్టిన వాడిలా ఒక్కసారిగా ''పుల్లన్ని బండిదించండిరా! మినిస్టరు గారు పట్నం పోతుంర్డు గదా, ఆయన మోటర్లనే ఏస్కపోదాం. దించండి దించండి. అడికి కారుకాడికి మోస్కరాంర్డి.'' అని మంత్రి గారిని కలవడానికి పరుగుతీసాడు సర్పంచు, తనకుడి చేతిని ఎవరో నరికివేసినట్టు.

ఈ మధ్య వాతావరణం మారింది. చల్లగాలులూ వీయడం, అడపా దడపా చినుకులు మొదలయ్యాయి.

సర్పంచుగారదే విశయం మంత్రిగారికి చెప్పారు "అయ్యయ్యో అంత పనయిందా! అదేనయ్య ఈ సద్వరానోల్ల తోటి వచ్చిన ఇబ్బంది.

అయితే తొందరగా బందేర్పాటు చేసి పంపించు. చూసినవ్ గదా కారు నిండ ఒచ్చినం మేం. అందుల ఒర్షం మొదలయింది. మల్లిప్పుడు తాలూకల ఇంకో ఉపన్యాసమిచ్చేది వున్నదాయె. అక్కడది చూసుకొని రాత్రికి రాత్రే నగరం ఎల్లిపోవాల్నాయె-ఒక్క-క్షణం తీరికె వుండదు."

మాటలు తొత్తర పోతున్నాయి. మాటల్లాగే అడుగులు...పాపం! అనుచరుల్లో ఇద్దరు ఎంచక్కా బాంగ్డా డాన్స్ చేసినంత పని చేసేస్తున్నారు.

''ఏయ్ మిగిల్నయ్ డిక్కీల పెట్టినట్టేనా?" అంటూ తన వెంట వచ్చిన యాదగిర్ని చూసాడు మంత్రి గారు.

"తెస్తున్న సార్" అంటూ ఓ పెద్ద డబ్బా పట్టుకొచ్చి డిక్కీలో పెట్టాడు ఆట్ట డబ్బాల్లో సీసాలు కొట్లాడుతున్న చప్పుడు ఎవ్వరూ విన్లేదు.

'సరే మళ్ళీ కలుద్దాం!" అంటూ కారువైపు నడిచారు, అనుచరుల తోసహా మంత్రిగారు.

కారు కదిలింది-అంటే పుల్లడిని తీసుకుపోయే పీడ తప్పింది.

"హూఁ ఉపన్యాసమియ్యాలె'' గొనుకున్నాడు సర్పంచు తనలోనే ''ఒరేయ్ మల్లిగా పెద్దబండి తొందర్గ నడ్వదు. మా దొడ్లెకుపోయి కచ్చరంగట్కరా ఫో" పురమాయించి పుల్లని వైపు కదిలాడు.

ఆకాశం ఉరిమింది పుల్లని మూల్గు ఆగింది.

ఆకాశం ఏడ్చింది.

ఆకాశంలో చటుక్కున మెరుపు మెరిసింది. ఆత్మ ఆకాశాన్ని ఆలింగనం చేసుకున్నట్లు.

దూరంగా చీకట్లో కారు వెనక లైట్లు ఎర్రగా మెరుస్తున్నాయ్-మృత్యువు కళ్ళలా-

కృష్ణాపత్రిక
6-8-1971